


# కథ

**కలిగినీడి దుర్గాదేవి**

# మంచుశిల

"రాణిగారు ఎక్కడికో బయలు దేరినట్టున్నారు?" కాస్త వెటకారం మిళితమైన స్వరంతో అన్నారు సీతారామయ్యగారు.

పాకుతూ వెళ్తోన్న త్రాచు చివాలున వెనక్కి తిరిగి పడగ విప్పినట్టు వెనక్కి తిరిగిన పార్వతమ్మగారు "అవును మరి, రాజుగారికి అడ్డమైన పుస్తకాలు చదవడంలోనూ క్షణం తీరిక ఉండదు కదా రాణిగారు బయట తిరక్క ఏం చేస్తుంది? అయినా నాకు తెలవకడుగు తానూ ఈ వయసులో అన్నేసి పుస్తకాలు చదవడం అవసరమా అని?" అంది.

"నీలాంటివాడే ఒకడు ఒక మహానుభావుడిని అడిగాడట ఇదే ప్రశ్న. దానికాయన తన తలని చూపించి 'దీన్ని ఖాళీగా భూమిలో పాతిపెట్టడం ఇష్టంలేక పుస్తకాలు చదువుతాను' అన్నాడట. జ్ఞానం, అనుభవం సంపాదించడానికి జీవితానుభవం మీద ఆధారపడి చేతులు కాల్చుకోనక్కర లేదు. ఎందరో మేధావుల అనుభవాల సారమైన పుస్తకాలు చదివితే చాలు అన్నది ఈ సీతారామయ్య ఉవాచ. అయినా శ్రీమతీ, పుస్తకాలు చదవడానికి వయసుతో సంబంధం ఏముందే? వయసైపోయిందని అన్నం తినడం మానేస్తామా? ఇదీ అలాగే" అన్నారు సీతారామయ్యగారు.

"ఆ.. ఆ... మీ ఉపన్యాసాలన్నీ నా దగ్గరే. ఏదో చదువురాని మొద్దునీ, తింగరిదాన్ని కాబట్టి మీ నంగి మాటలన్నీ వింటుంటాను"

"నిన్నెవరు చదువుకోవద్దన్నారే? అది కూడా నా తప్పే?"

"జీవితాంతం మీకూ, మీ పిల్లలకీ వంట చేసి పెట్టే వంటలక్కలాగానే గడిచిపోయింది. నాకింకా చదువూ, చట్టుబండలూనా?"

"నీకు ఆ వంటొక్కటే బాగా చేయడం వచ్చు. మిగతా విషయాల్లో స్వతహాగా మొద్దువి. పైగా ఆ రోజుల్లో ఆడవాళ్ళు చదువుకోవడం అంటే అబ్బురమూ, ఆశ్చర్యమూను. చదువుకోవడం కోసం ఆడవాళ్ళే ధైర్యంగా ముందుకు రాని రోజులు. అందులో నువ్వు మరీనూ. అయినా నీకు ఆసక్తి ఉంటే నేనేం వద్దని వారించేవాడినా? చదవమని ప్రోత్సహించేవాడిని కానూ?"

ఆ మాట మాత్రం నిజం. ఆయన ఆదర్శ భావాలు కలవాడే. పైగా ఆదర్శాలు మాటల్లో మాత్రమే కాదు చేతల్లోనూ చూపించే రకం. పిల్లలని తన ఆదర్శాలకీ, ఆశయాలకీ అనుగుణంగా పెంచారు. సమాజానికి మంచి పౌరులని అందించారు.

ఆ ఆలోచనలో ఉండిపోయిన ఆవిడని చూస్తూ "ఇంతకీ ఎక్కడికో ప్రయాణం?" అన్నారాయన.

పార్వతమ్మగారు ఆలోచనలోంచి బయటపడి "పైన ఉంటున్న సౌమ్య దగ్గరకి. పాపం ఆ పిల్ల ఒంటరిగా ఉంటుంది. కాస్త తోడుగా ఉండి మీరు భోజనం చేసే వేళకి వస్తాను" అంటూ బయటకి నడిచింది.

"భార్యాభర్తలు చిలకాగోరింకల్లా కువకువలాడుతూ ఉండాల్సిన వేళ పాపమాపిల్లకి ఆ ఒంటరితనం ఏమిటో?" అనుకుని నిట్టూర్చి పుస్తకం తెరిచారు సీతారామయ్యగారు.

* * *

సోఫాలో తనకు తాను పడుకున్నట్లుగా కాక, ఎవరో బలంగా విసిరేసినట్లుగా పడి ఉంది సౌమ్య. అయిదున్నరకి ఆఫీసు నుంచి వచ్చినప్పుడు నిస్త్రాణగా ఎలా వాలిపోయిందో, ఇప్పుడు ఏడు గంటలకి కూడా అలాగే పడుకుని ఉంది. అయినా అలసట తీరనే లేదు.

వేడివేడిగా కాఫీ తాగితే ఆ అలసటపోయి ఉత్సాహం వస్తుంది. కానీ కాఫీ పెట్టుకోవడం కోసం లేవడానికి కూడా ఓపిక లేదు.

శరీరం నీరసంగా ఉంటే వేరు. ఎలాగో ఓపిక తెచ్చుకుని దానికి శక్తిని అందించవచ్చు. కానీ మనసుకి నీరసంగా ఉంటేనో...ప్రస్తుతం సౌమ్య పరిస్థితి అదే.


పల్లెటూళ్లో పుట్టింది. ఆడది ఇంటి గడప దాటకూడదంటే దాటకుండానే ఎదిగింది. నలుగురు కూడే చోట నిలవకూడదనీ, నవ్వకూడదనీ అంటే నిలవడమూ నవ్వడమూ మానేసింది. ఆమె ఎదిగే క్రమంలో ఆడపిల్లలు కూడా చదువుకోవాలి. ఉద్యోగాలు చేయాలి అంది సమాజం. బాగా చదువుకుంది సౌమ్య.

అంతే ఆడదాని జీవితం. సమాజం ఎలా ఉండాలంటే అలా...ఎలా నిర్దేశిస్తే అలా..తల్లిదండ్రులు ఎవరితో ముడిపెడితే వాడితో తలవంచుకుని వెళ్ళిపోవాలంటే వెళ్ళిపోయేది ఆ రోజుల్లో ఎవరినో ఒకరిని ప్రేమించి మోసపోవడమో, వాడి చేతిలో హతమవడమో, ఏ యాసిడ్ వానలోనో తడిసిపోవడమో...ఈ రోజుల్లో.


సౌమ్య జీవితంలోకి శ్రీకర్ వచ్చాడు. నువ్వు నాకు నచ్చావ్ అన్నాడు. నువ్వే కావాలి అన్నాడు. నిన్నే పెళ్ళాడతా అన్నాడు. నీతోడిదే లోకం. నిన్ను క్షణమైనా విడిచిపెట్టను. నిన్ను చూడక నేనుండలేను అన్నాడు. నా చిటికెన వేలు పట్టుకుని నా జీవితంలోకిరా...నీ చితిలో సైతం నే తోడుంటానన్నాడు.

"మరి మా అమ్మా, నాన్నో..నా కుటుంబమో" అంది సౌమ్య

"వదిలేసిరా...వాళ్ళకన్నా ఎక్కువగా, బాగా







నేను చూసుకుంటాను నిన్ను. ఎంత మంది ప్రేమికులు తల్లిదండ్రుల్ని వదిలేసి రావడం లేదు?" అన్నాడు.

అలాగే వచ్చేసింది సౌమ్య కొంతమంది స్నేహితుల మధ్య నిరాడంబరంగా జరిగిపోయింది వాళ్ళ పెళ్ళి. రాజధాని నగరంలో ఉద్యోగాలు చూసుకుని, ఇల్లు వెతుక్కుని కాపురం పెట్టారు.

పెళ్ళయిన పదిహేను రోజుల తర్వాత ఒక రాత్రి బాగా ఆలస్యంగా వచ్చాడు శ్రీకర్.

"పెళ్ళి పార్టీ ఇవ్వవలసి వచ్చింది ఫ్రెండ్స్‌కి. అర్థం చేసుకో ప్లీజ్" అన్నాడు ఎదురుచూసీ, చూసీ అదోలా అయిపోయిన ఆమెని చూస్తూ ....ఆమె ఏమీ అడక్కుండానే.

"సురేష్ వాళ్ళావిడ ఊరెళ్ళింది. రాత్రి వాళ్ళింట్లో కూర్చున్నాం" అన్నాడు ఒకసారి.

"నిన్ను మీ వాళ్ళకి దూరం చేశానన్న బాధతో తాగానీ వేళ" అంటూ వచ్చి తాగినదంతా కక్కుకున్నాడు మరోసారి.

మొత్తానికి అతనికి స్నేహితులెక్కువ. స్నేహితులే ఎక్కువ. ప్రేమికురాలిగా వారితో పాటు తనకీ కొంత భాగం పంచాడు. భార్యగా మారిపోయాక అతనూ భర్తలా మారిపోయాడు.

అప్పుడు చుట్టుముట్టింది ఒంటరితనం సౌమ్యని. కొండచిలువలా ఒక్కో చుట్టే చుట్టుకుంటూ ఆమెని కబళిస్తోంది. ఎప్పుడో డిప్రెషన్‌గా మారి ఆమెని నుజ్జు నుజ్జు చేస్తుంది.

ఎన్నెన్ని కలలు కంది తను..భర్తతో కలిసి సినిమాలు, షికార్లు, పార్కులు, రెస్టారెంట్లు, అందమైన ఆహ్లాదకరమైన సాయంకాలాలు, స్వీట్ నథింగ్స్, వేడి కాఫీ, చల్లని ఐస్‌క్రీమ్, అద్భుతమైన రాత్రులు.

శ్రీకర్‌తో కలిసి ఆ కలలు ఊహించుకుంటేనే ఎంతో థ్రిల్లింగ్‌గా ఉండేవి. అలాంటిది అనుభవంలోకి వస్తే...

వస్తే ఎలా ఉంటుందో తెలియకుండానే ఊహకైనా అందనివి ఏవేవో అనుభవం లోకి రావడం మొదలుపెట్టాయి.

"జీవితం ఇంకా మొదలే అవలేదు. అప్పుడే అంతం అయిపోతునట్టుగా ఉందేమిటి నాకు?" ఎక్కడో చదివిన వాక్యాన్ని గుర్తుచేసుకుంటూ అనుకుంది సౌమ్య.

అప్పుడప్పుడూ గిల్టీఫీలింగ్ వస్తుందేమో శ్రీకర్‌కి. "నిన్ను బాధ పెడుతున్నానా సౌమ్యా. నాకు తెలుసు నువ్వు బాధపడవు. అర్థం చేసుకుంటావు. పరిస్థితులెప్పుడూ ఇలాగే ఉండవు. నువ్వు మంచిదానివి. నీకు అర్థం చేసుకునే గుణమెక్కువ. ఓర్పు కూడా ఎక్కువే. అయినా మరోసారి చెప్తున్నా అర్థం చేసుకో ప్లీజ్" అంటుంటాడు.

ఆమె అర్థం చేసుకుంటుంది... చచ్చినట్టు.

"ఏం అమ్మాయ్. లైటయినా వేసుకోకుండా ఏం చేస్తున్నావ్?" అన్న పార్వతమ్మగారి మాటతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది సౌమ్య.

ఆవిడ లైటు వేసి, సౌమ్య వాలకం చూసి "కాస్త మొహం కడుక్కుని రామ్మా, ఈలోగా కాఫీ పెడతాను" అంటూ వంటింట్లోకి వెళ్ళింది.

'మీకెందుకండీ శ్రమ' అని మొహమాటానికైనా అనలేదు సౌమ్య. ఆమె ఉన్న ఆ స్థితికి ఒక మనిషి తోడు కచ్చితంగా అవసరం మరి.

★ ★ ★

బ్లూమూన్ బార్ అండ్ రెస్టారెంట్ తాగేవాళ్ళ గోలతో, గ్లాసుల గలగలలతో సందడి సందడిగా ఉంది.

ఒక టేబుల్ చుట్టూ కూర్చుని తాగుతూ ఉన్నారు శ్రీకర్ మిత్ర బృందం. రకరకాల టాపిక్‌లు, బాధలు, వ్యధలు, కష్టాలు. అవేవీ తాగుడు వల్ల తీరవు. అయినా అవి తాగేటప్పుడు మాత్రమే బయటికి వస్తాయి.

గ్లాసులో ఉన్న విస్కీని గటగటా తాగేసి 'ఇక నేను వెళ్తాను. మా ఆవిడ ఎదురుచూస్తూ ఉంటుంది' అంటూ లేచాడు ప్రసాద్.

అంతా ఒక్కసారిగా ఘొల్లున నవ్వారు.

శేఖర్ అయితే "నేను చెప్పానా..తొమ్మిది అవడం పాపం, నా పెళ్ళామో అంటూ పరుగు తీస్తాడు గురుడు. ఇలా అయితే కష్టం గురూ. పెళ్ళాం మాట మనం వినకూడదు. మనమాట పెళ్ళాం వినేలా ఉండాలి ఎప్పుడూ. ఏముంటుందయ్యా పెళ్ళా దగ్గరా..సుఖమంటారా అది ఎప్పుడెళ్ళినా దొరుకుతుంది కదా. ఆమాత్రం దానికి సందకాడే వెళ్ళి ఇంట్లో కూర్చోవలసిన పనేముంది?" అన్నాడు.

"ఏదైనా అందుబాటులో ఉన్నంత వరకూ దాని విలువ తెలియదు. లేనప్పుడే తెలుస్తుంది. మొగుడు కూడా అంతే. అందీ అందకుండా ఉంటూ పెళ్ళానికి విలువ తెలిసేలా చేయాలి" అన్నాడు మూర్తి.

"సారీ బాస్..నా పాలసీ నాది. నా అలవాట్లకి ఆమె అడ్డం పడదు. అవే కాస్త తొందరగా తెముల్చుకుని ఆమెకి సంతోషం కలిగిస్తే తప్పేమీలేదు కదా" అని వెళ్ళిపోయాడు ప్రసాద్.



శ్రీకర్ ఏమీ మాట్లాడకుండా ఆలోచిస్తూ కూర్చున్నాడు. అతనికి సౌమ్య గుర్తొచ్చింది. ప్రస్తుత సౌమ్య కాదు, తను ప్రేమించిన నాటి సౌమ్య. అప్పటికీ ఇప్పటికీ ఎంత తేడా? నిండు గోదావరిలా వుండేది. ఎండిన గోదారిలా అయిపోయింది. దానికి తనే కారణమేమో..కాస్త జాలిగా అనిపించింది ఒక్క క్షణం. ఇంటికి త్వరగా వెళ్దామని కూడా. అయితే స్నేహితులంతా ఏమంటారో అని సంశయిస్తూ ఆగిపోయాడు.

మామూలుగా గ్లాసు అందుకుని గుటక వేశాడు. "అదంతా వంక. నిజంగా వెళ్ళాలనే ఉంటే ప్రసాద్‌లా వెళ్ళిపోవచ్చుగా" అంటోన్న అతని అంతరాత్మ ఆ విస్కీలో జలసమాధి అయిపోయింది.

★ ★ ★

ఎత్తయిన కొండమీద ఉందా వినాయకుడి గుడి. ఎంతో ఆహ్లాదంగా, ప్రశాంతంగా ఉంటుంది.

సీతారామయ్య దంపతులు పెట్టిన ఆ ప్రోగ్రామ్‌కి సౌమ్య, శ్రీకర్ కూడా వచ్చారు. ఆయనకి తోడుగా శ్రీకర్, ఆవిడకి తోడుగా సౌమ్య ఉండి కొండ ఎక్కారు.

ఆ గుడిలో ఏదైనా కోరిక చీటీలో రాసి హుండీలో వేస్తే తప్పక నెరవేరుతుందని ప్రసిద్ధి.

"నాకన్నా ముందే నా భర్తని నీ దగ్గరికి తీసుకుపో స్వామీ" అని చీటీ సౌమ్యతో రాయించి హుండీలో వేసింది పార్వతమ్మగారు.

అదేమిటని ఆశ్చర్యపోయిన సౌమ్యతో "ఆయన అన్నింటికీ నా మీద ఆధారపడిన మనిషి. అన్నీ కాళ్ళ దగ్గరకి అందించాలి. పిల్లలేమో తలో చోటా స్థిరపడ్డారు. ఇలాంటి స్థితిలో నేను గనుక ముందు పోతే ఆయనకెంత కష్టం" అందావిడ.

"అయితే మామ్మగారూ, ఆయనతో మీరు సంతృప్తిగానే ఉన్నారా ఇన్నాళ్ళూ" అంది

## లక్కీ స్వాతి

కలర్స్ స్వాతిగా టీవీ ప్రేక్షకులకు చిరపరిచితురాలైన స్వాతి తెలుగులో డేంజర్, ఆడవారి మాటలకు అర్థాలు వేరులే, అష్టాచెమ్మా, కలవరమాయె మదిలో సినిమాల్లో నటించింది. తమిళంలో ఆమె నటించిన 'సుబ్రమణ్యపురం' హిట్ కావడంతో కోలీవుడ్ జనాల్ని కూడా ఆకట్టుకుంది. ఇప్పుడామెకి విక్రమ్ సరసన నటించే చాన్స్ వెతుక్కుంటూ వచ్చిందట. సెల్వరాఘవన్ దర్శకత్వంలో విక్రమ్ హీరోగా నటించే కొత్త చిత్రంలో హీరోయిన్‌గా స్వాతిని ఎంపిక చేస్తున్నట్టు చెన్నయ్ సినీవర్గాల సమాచారం. ఇదేగనక నిజమైతే స్వాతి దశ తిరిగినట్టే!

సౌమ్య, మదిలో శ్రీకర్ మెదులుతూ ఉండగా.

“ఒక చేతి వేళ్ళు కూడా ఒకేలా వుండవు. సౌమ్యా..దాంపత్యమంటేనే ఇద్దరు విభిన్న వ్యక్తుల కలయిక. ఎవరికి ఎవరూ పూర్తిగా నచ్చరు. మనం ఎలా ఉండాలనుకుంటామో అలా ఉండరు. కొంత మనం సర్దుకుపోవాలి. మరికొంత మారాలి. అంతేకాదు, అవతలి వ్యక్తి మారడం లేదూ అని ప్రతిక్షణం బాధపడకూడదు. మన మనసుకు నచ్చే వ్యాపకాలతో సంతోషంగా గడపాలి. జీవితం చాలా చిన్నదమ్మా. దాన్ని బాధతో తక్కువగా, ఆనందంతో ఎక్కువగా నింపాలి. అలా ఉండగలిగితే శత్రువుతో కూడా సంతృప్తిగా గడపవచ్చు. భర్తనగా ఎంత?” అంది పార్వతమ్మగారు.

* * *

“నిజానికి నేను నాస్తికుడ్ని తెలుసా?” దర్శనం టిక్కెట్లు తీసుకుని వస్తూ ఉండగా అన్నారు సీతారామయ్యగారు.

ఆయన పక్కనే నడుస్తున్న వాడల్లా ఆ మాటతో ఆయన వంక ఆశ్చర్యంగా చూసాడు శ్రీకర్.

“కానీ నా భార్యకి నాతో కలిసి గుళ్ళకీ, గోపురాలకీ తిరగడంలో ఆనందం. అందుకని నేను వస్తుంటాను. అలాగే ఆవిడకి తీర్థాలూ, జాతరలూ, బంధుమిత్రులతో సరదాగా గడపడం..ఇలాంటివి ఇష్టం. నాకేమో చిరాకు. కానీ ఆమె కోసం నేను మారాను. ఎందుకు మారానూ అంటే ప్రతి భార్యా భార్యగా మారాక మారుతుంది గనుక. భర్తకోసం ఒక్కటే కాదు, పిల్లలకోసం, అత్తమామల కోసం, ఆడపడుచుల కోసం..మారుతూనే ఉంటుంది. మనం వాళ్ళ కోసం మారితే తప్పేమిటి? ఎప్పుడూ మన సమాజం స్త్రీకి అన్యాయం చేసిందయ్యా శ్రీకర్..కనీసం ప్రతి భర్తా తన భార్యకి న్యాయం చేయడం ద్వారా ఆ అన్యాయాన్ని సరిచేయాలి”

శ్రీకర్ ఏమీ మాట్లాడలేదు గానీ శ్రద్ధగా వింటున్నాడు.

“భార్యని జీవిత భాగస్వామి, అర్ధాంగి అన్నారు. కనుక మన జీవితంలో సగభాగాన్ని ఆమెకి కేటాయించి తీరాల్సిందే. అది చాలా కష్టంగా ఉంటుందనుకో అయినా ఈ సమాజం చేసిన నిర్దేశాల వల్ల మగాడికే ఎక్కువ లాభం గనుక మగాడు కొంత కష్టపడడంలో తప్పేమీ లేదు. నిజానికి, భార్యకి సగభాగం కేటాయించినందుకే శివుడ్ని అర్ధనారీశ్వరుడిగా కీర్తిస్తారు గానీ పార్వతి కోల్పోయిన సగభాగం గురించి ఎవరూ పట్టించుకోరు. అయినా తానేం కోల్పోతున్నా పట్టించుకోదు స్త్రీ. కానీ భర్తనే కోల్పోతుంటే..” అని అతని సమాధానం కోసం అన్నట్టు ఒక్కక్షణం ఆగారాయన.



అప్పుడు కూడా ఏమీ మాట్లాడలేదు శ్రీకర్.

“మగాడికి బయట ప్రపంచంలో వెయ్యి వ్యాపకాలు, వందమంది స్నేహితులు. మరి స్త్రీకి...నాలుగ్గోడలే ప్రపంచం. భర్తే స్నేహితుడు. కొట్టుకున్నా, తిట్టుకున్నా జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నా దుఃఖాన్ని పంచుకున్నా, నవ్వుతో తుళ్ళితుళ్ళిపడినా..అన్నీ ఆ ఒకే ఒక్కడైనా భర్తతోనే కదా. అందులోనూ ప్రేమించి పెళ్ళి చేసుకుని విడిగా కాపురం పెట్టిన మీ జంట లాంటి వాళ్ళలో మరీను..”

శ్రీకర్ ఏమీ బండరాయి కదా. మంచుశిల మాత్రమే. అందుకే ఆచితూచి మాట్లాడారాయన.

ఒక్క క్షణం ఆగి ముక్తాయింపుగా మళ్ళీ అన్నారు సీతారామయ్యగారు. “ప్రపంచంలో ఇదే పెద్ద జబ్బయ్యా శ్రీకర్..ఇలా ఉపన్యాసాలు ఇవ్వడం. అక్కడికి నీకేదో తెలియనట్టు ఇదంతా చెప్పాను చూడు. సర్లే పద పద..మనవాళ్ళు ఎదురుచూస్తున్నారు”

ఇద్దరూ సౌమ్య, పార్వతమ్మల దగ్గరకి వెళ్ళేసరికి పార్వతమ్మగారు సీతారామయ్యగారి వంక ఎంతో యిష్టంగా చూసారు. సౌమ్యా, శ్రీకర్‌లు అయితే సరేసరి.

ముమ్మారు మోగిన గుడి గంట వాళ్ళని తిరిగి ఈ లోకం లోకి తెచ్చింది.

○

## కోలీవుడ్‌కి కటీఫ్?

కేరళ కుట్టి నయనతార తమిళ సినీరంగానికి కొంత కాలం పాటు దూరంగా వుండాలనుకుంటోందిట. మలయాళంలో కంటే తెలుగు, తమిళ రంగాల్లోనే ఎక్కువ పాపులారిటీ వున్న నయనతార గురించి తమిళ సినీ రంగంలోనే ఎక్కువగా పుకార్లు పుడుతున్నాయని, వాటి వల్ల విసిగిపోయి తనీ నిర్ణయానికొచ్చినట్టు ఆమె సన్నిహితుల ఉవాచ. బాలీవుడ్‌లో తనకి మంచి గౌరవం వుందని కాబట్టి ఇక్కడ సినిమాలు చేయడమే బావుంటుందని భావిస్తూ, అటు బాలీవుడ్ ప్రయత్నాలు కూడా ముమ్మరంగానే చేస్తోందిట.